క్లుప్తంగా

సంక్షేమ రూపకర్త వైఎస్సార్



విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే

పాలకొండ రూరల్: బడుగు, బలహీన వర్గాల పాలిట ఆత్మబంధువు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని కోరి ఆయన ఎన్నో సంక్షేమ పథకాలు రూపొందించారన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 2వ తేదీన వాడవాడలా వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం పది గంటలకు పాలకొండ వైఎస్సార్ కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరుకోవాలన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులర్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

మొక్కల పంపిణీ

కురుపాం: పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ మండలంలోని బియ్యాలవలస పంచాయతీ, దురుబిలి గ్రామంలోని గిరిజన రైతులకు పండ్లతోటల మొక్కలను రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి కొత్తకోట మల్లికార్జునరావు ఆదివారంఅందజేశారు. మొత్తం 75 మందికి మామిడి, సపోటా, జామ మొక్కలను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, సర్పంచ్ పువ్వల అజ్జారి, మాజీ సర్పంచ్ పువ్వల పత్తి పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయండి



రామకృష్ణ

కురుపాం: ఎరువుల కోసం రైతులు అవస్థలు పడుతున్నారని, ఇప్పటికైనా వారికి సరిపడ ఎరువులు సరఫరా చేయాలని ట్రైబల్ రైట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ కోరారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఎరువుల కోసం రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్తే అక్కడి వీఏఏలు తమ వద్ద ఎరువులు లేవు..ఇండెంట్‌లు పెట్టామని అక్కడి నుంచి పంపేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి సాగు జరుగుతోందని, ఇలాంటి సమయంలో రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధం చేయాలని తెలియదా అని అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, యూరియా, డీఏపీలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ఆమె సేవలు మార్గదర్శకం



సన్మానగ్రహీతతో ఉద్యోగులు, సిబ్బంది

పాలకొండ రూరల్: కండక్టర్‌గా ఆమె అందించిన సేవలు సహోద్యోగులకు మార్గదర్శకమని జిల్లా డీపీటీఓ, స్థానిక డీఎం పట్నాన వెంకటేశ్వరరావు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన కండక్టర్ జి.సుమతిని ఆదివారం స్థానిక డిపో గ్యారేజీ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈయూ జోనల్ కార్యదర్శి బీకే మూర్తి, ఏడీఎం వి.రమేష్, ఈయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంవీఎస్.నారాయణ, జె.రాములు, దామోదరనాయుడు, వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికవేత్త శ్రీనివాసరావుకు అవార్డు



బత్తిలి శ్రీనివాసరావుకు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

భామిని: మండలంలోని బత్తిలికి చెందిన ఆధ్యాత్మికవేత్త బత్తిలి శ్రీనివాసరావుకు విశాఖకు చెందిన ప్రజాసంకల్ప వేదిక ఆదివారం రాష్ట్ర స్థాయి అవార్డుతో సత్కరించింది. శ్రీనివాసరావు ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో అందించిన సేవలకు గాను ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

వాడవాడలా అన్నదానం



లుంబూరు అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: వినాయక ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లుంబూరు, అంపిలి, అన్నవరం, గుడివాడ, తదితర గ్రామాల్లో ఆదివారం అన్నదానాలు నిర్వహించారు. అంతకుముందు గణనాథుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.

జాగ్రత్తలు తప్పనిసరి



నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు

- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నిమజ్జనోత్సవంలో అప్రమత్తంగా ఉండాలి
- హెచ్చరికలు జారీ చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్:

గణపతి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనోత్సవాల్లో ఎటువంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల ధాటికి నాగావళి, వంశధార నదుల్లో వరద నీరు భారీగా చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్ష ప్రభావం వల్ల వాగులు, చెరువులు, కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిమజ్జనోత్సవాల్లో ఎటువంటి నిర్లక్ష్యం కనబరిచినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని అధికారులు చెబుతునానరు. గతంలో జరిగిన నిమజ్జనోత్సవాల్లో పలు ప్రమాదాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఇటీవల పాలకొండ పరిసరాల్లో ఇద్దరు యువకులు నదిలో పడి దురదృష్టవశాత్తూ మృత్యువాత పడిన సంఘటనను పోలీసులు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిమజ్జనోత్సవంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.



వినాయక మంటపాల వద్ద నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాటించాల్సిన జాగ్రత్తలు..

- నిమజ్జనోత్సవానికి ముందుగా పోలీసులకు సమాచారం తెలియజేస్తే అవసరం మేరకు తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తారు. తద్వారా ఎటువంటి గొడవలు, ఘర్షణలు జరగవు.
- ఊరేగింపులో యువత మందుగుండు కాల్చకూడదు. అలాగే డీజేలు ఉపయోగించకూడదు.
- భారీ వర్షాల కారణంగా నదులు, కాలువలు, చెరువుల్లో నీటి ఉధృతిని అధికంగా ఉంది. ఈత రాని వారు, చిన్నారులు నదులు, చెరువుల్లో దిగరాదు.
- స్వామి ఊరేగింపునకు వాడే వాహనానికి అతిగా విద్యుత్ అలంకరణలు చేయరాదు.
- ఇతర మతస్తులను గౌరవించాలి, సంయమనంతో అన్నివర్గాలను కలుపుకుంటూ వెళ్లాలి.
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి.
- వీలైనంత వరకు వెలుగు ఉంటుండగానే నిమజ్జన కార్యక్రమం పూర్తి చేయాలి.

బాధ్యతగా వ్యవహరించాలి..



నిమజ్జనోత్సవాల్లో కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పోలీస్, విద్యుత్ శాఖల సహకారం తీసుకోవడంతో పాటు సూచనలు పాటించాలి. నదులు, చెరువుల్లో దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

– మీసాల చంద్రమౌళి, సీఐ పాలకొండ.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



పాలకొండ: సైకిల్ ర్యాలీ చేస్తున్న డీఎస్పీ, సిబ్బంది

- డీఎస్పీ రాంబాబు

పాలకొండ: పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలని డీఎస్పీ ఎం.రాంబాబు సూచించారు. పట్టణంలో సండే సైకిల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది సైకిల్ ర్యాలీ చేపట్టారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ఒత్తిడిని జయించడానికి సైక్లింగ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆయనతో పాటు ఎస్సై ప్రయోగమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌కు సైకిల్ తొక్కాల్సిందే ..

సీతంపేట: ఫిట్‌నెస్‌కు సైకిల్ తొక్కాల్సిందేనని స్థానిక ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఫిట్ ఇండియా నినాదంతో పోలీసులు, యువతతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు.

'సండే ఆన్ సైకిల్'

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేటలో పోలీసుల ఆధ్వర్యంలో సండే ఆన్ సైకిల్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సీఐ బి.హరి పోలీస్ సిబ్బంది కలిసి గ్రామంలో సైకిల్ తొక్కుతూ సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిరోజూ కొంత సమయం సైకిల్ తొక్కడం వల్ల శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు.

బత్తిలిలో..

భామిని: మండలంలోని బత్తిలిలో ఎస్సై జి.అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. యువత ఆరోగ్యం కోసం సైక్లింగ్ చేయాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ సిబ్బంది, యువత పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు



వీరఘట్టం: సైకిల్ ర్యాలీ చేస్తున్న పోలీసులు



భామిని: ఎస్సై అప్పారావు ఆధ్వర్యంలో సైకిల్ తొక్కుతున్న యువత

ఫిట్ ఇండియా సాధనకు కృషి చేద్దాం..

వీరఘట్టం: ఫిట్ ఇండియా సాధనకు అందరం కృషి చేద్దామని ఎస్సై జి.కళాధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సహచర సిబ్బందితో సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అన్నివర్గాల వారు వ్యాయామం చేయాలని సూచించారు.

గ్రామాల్లో సుగర్, బీపీ తనిఖీలు



తోలుఖర్జలో తనిఖీలకు వైద్య శిబిరానికి చేరుకున్న గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ, తోలుఖర్జ, గోరటి గ్రామాల్లో రాఫా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఆదివారం నిర్వహించారు. శిబిరాలకు హాజరైన వారికి సుగర్, బీపీ తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మెరుగైన ఆరోగ్యానికి ప్రతిరోజూ ఎంతో కొంత వ్యాయామం చేసి పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీన్ కంటి మహంతి, ఎం.శోభన్‌బాబు, జి.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ల యజమానులతో సమావేశం రేపు

కురుపాం: మేజరు పంచాయతీ పరిధిలోని లేఅవుట్ల యజమానులతో ఈ నెల 2వ తేదీన సమావేశం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ విస్తరణ అధికారి కండి సురేష్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. అధికారిక, అనధికారిక లేఅవుట్ల యజమానులు, బొబ్బిలి అర్బన్ డెవలపర్స్ అథారిటీ అధికారులంతా ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో జరిగే ఈ సమావేశానికి లేఅవుట్ల యజమానులంతా హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



వీరఘట్టం కుమ్మరివీధిలో కుంకుమ పూజలు చేస్తున్న దంపతులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని బీసీ కాలనీ కుమ్మరివీధిలో వరసిద్ధి వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అలాగే బీసీ కాలనీలోని మరో వినాయక మంటపం వద్ద.. విక్రమపురం గ్రామంలో అన్నసమారాధనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.

కొనసాగుతున్న పూజలు..

భామిని: మండలంలోని వినాయక మంటపాల వద్ద ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. బత్తిలి చినవీధిలో చిన్నారులచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే నేరడి-బి వద్ద మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.



భామిని: బత్తిలి మంటపం వద్ద కుంకుమ పూజల్లో పాల్గొన్న చిన్నారులు

పెదపెంకిలో ఆదిభట్ల జయంతి

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఆదిభట్ల నారాయణదాసు జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎం.మహేష్, ఎం.శంకరరావు, ఎ.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బాబు పాలనలో అభివృద్ధి శూన్యం



మర్రిపాడులో బాబు మోసాలను వివరిస్తున్న నాయకులు

సీతంపేట: సీఎం చంద్రబాబు పాలనలో గిరిజనాభివృద్ధి శూన్యమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు ఆరోపించారు. మండలంలోని మర్రిపాడు పంచాయతీలోని పలు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా కూటమి నాయకులు ప్రజలను మోసగిస్తున్నారన్నారు. ఇంటింటికి వచ్చి రేషన్ ఇచ్చే ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో గిరజనులకు రేషన్ కష్టాలు వీడడం లేదన్నారు. గిరిజన గ్రామాలకు సరైన రహదారులు లేవని, అయినా కూటమి నాయకులు స్పందించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గణేష్, మాజీ సర్పంచ్ సింహాద్రి, పార్టీ నాయకులు వి.చలపతిరావు, కొండయ్య, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జీసీసీని బలోపేతం చేయండి

జియ్యమ్మవలస రూరల్: జీసీసీని మరింత బలోపేతం చేయాలని నాగూరు మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే కేకేవీవీవీ సత్యనారాయణరెడ్డిలు కోరారు. ఇదే విషయమై వారు అమరావతిలో గిరిజన సంక్షేమ ప్రభుత్వ కార్యదర్శి ఎంఎం నాయక్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జీసీసీని పూర్తిగా నిర్వీర్యం చేసి గిరిజనులకు వాటి సేవలు దూరం చేశారన్నారు. ఈ నేపథ్యంలో డీఆర్ డిపోలను పూర్తిస్థాయిలో నిర్మించి ఇవ్వాలని, గిరిజనులకు జీఎస్టీలో మినహాయింపు ఇవ్వాలని, జీసీసీలో పనిచేసే అధికారులకు ఆర్ఎం, జీఎంలుగా పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పాలంగట్టు..అదనపు ఆదాయానికి మెట్టు



పాలంగట్టు..అదనపు ఆదాయానికి మెట్టు అని నిరూపిస్తున్నారు..గరుగుబిల్లి రైతులు. పాలంలో ప్రధాన పంట సాగు చేయడంతో పాటు అదే పాలంగట్టు మీద మరో పంట వేసి అదనపు ఆదాయం సంపాదిస్తున్నారు. సన్యాసిరాజుపేట, నాగూరు, సుంకి, రావివలస, గరుగుబిల్లి, కారివలస, రావివలస ఇలా ఏ గ్రామ పొలాలు చూసినా ప్రధాన పంట పొలం గట్టుపై బీర, చిక్కుడు, బెండ, కంది ఇలా ఏదో ఒక కూరగాయ పంట సాగు చేయడం కనిపిస్తూనే ఉంటుంది. వరి ఉభాలు వేయడం తర్వాత గట్లు శుభ్రం చేసి ఇలా కూరగాయల సాగు చేస్తున్నారు. తక్కువ మొత్తంలో పండితే ఇంటి అవసరాలకు, ఎక్కువ మొత్తంలో లభిస్తే మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ఈ చిత్రంలో సన్యాసిరాజుపేట పాలంగట్టుపై చేస్తున్న చిక్కుడు పంట సాగును చూడొచ్చు.

–గరుగుబిల్లి

ఘనంగా శత్రుచర్ల పరీక్షిత్‌రాజు జన్మదిన వేడుకలు

కురుపాం: మండల కేంద్రంలోని రావాడ కూడలి వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శెట్టి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరై కేకు కట్ చేసి పరీక్షిత్‌రాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పార్టీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, వైస్ ఎంపీ పీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీలు టీవీఎస్ స్వామియాజులు, గౌడు సంతోషిరాణి, వెలమల బంగారునాయుడు, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ నూరెల్లా, మాజీ ఏఎంసీ చైర్మన్ నిమ్మల వెంకటరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కొదంగొల్ల గౌరీశంకరరావు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం పంచాయతీ, ఖడ్గవలస జంక్షన్ వద్ద వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు జన్మదిన వేడుకలు ఆదివారం అట్టహాసంగా చేశారు. పార్టీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని, కేకు కట్ చేసి తమ అభిమాన నాయకుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జై వైఎస్సార్ సీపీ.. జై జగన్..జై పరీక్షిత్ రాజు అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, మాజీ సర్పంచ్ అంబటి గౌరునాయుడు, మాజీ ఎంపీటీసీ మండల శంకరరావు, పార్టీ కార్యవర్గ సభ్యు లు దాసరి మాధవనాయుడు, మార్కొండ వాసునాయుడు, ఆవాల రామకృష్ణ, అశోక్ బ్రహ్మ, బొత్స తాతబాబు తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: ఖడ్గవలస జంక్షన్‌లో పరీక్షిత్‌రాజు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు



జియ్యమ్మవలస రూరల్: కేకు కట్ చేస్తున్న పరీక్షిత్‌రాజు మాతృమూర్తి రాజేశ్వరిదేవి

గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోరిశెట్టి గిరిబాబు, ఐ.రామకృష్ణ, తోయక గోపాల్, చంటి, కె.వెంకటరావు, పి.తిరుపతిరావు, వహీద్‌ఖాన్, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్‌లు పాల్గొని, కేకు కట్ చేసి పరీక్షిత్‌రాజుకు బర్త్ డే విషెస్ తెలియజేశారు. కార్యక్రమంలో తాడికొండ సర్పంచ్ ఎం.జగ్గారావు, గుమ్మలక్ష్మీపురం వైస్ సర్పంచ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



కురుపాంలో వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత తదితరులు



గుమ్మలక్ష్మీపురం: కేకు కట్ చేసి పరీక్షిత్‌రాజు పుట్టినరోజు సంబరాలు జరుపుకుంటున్న ఎంపీపీ దీనమయ్య తదితరులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి కోటలో వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు జన్మదిన వేడుకలను ఆయన మాతృమూర్తి శత్రుచర్ల రాజేశ్వరిదేవి ఆధ్వర్యంలో ఆదివారం ఆనందంగా జరుపుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఈ కార్యక్రమానికి హాజరై కేకు కట్ చేశారు. అనంతరం పరీక్షిత్‌రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్ నాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

గొల్లవానివలసలో గాయత్రి మహాయజ్ఞం

గరుగుబిల్లి: మండలంలోని మరుపెంట పంచాయతీ, గొల్లవానివలస గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నవకుండిల గాయత్రి మహాయజ్ఞం ఆదివారం భక్తిశ్రద్ధలతో చేశారు. స్వామి సేవా సమితి కార్యదర్శి కంచుమోజు రామ్మోహరావు పర్యవేక్షణలో ఈ యజ్ఞం చేసినానంతరం భగవద్గీత పారాయణం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు దంపతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు